

# అనగనగా ఓ మంచి కథ

# మార్పు

## పినిశెట్టి శ్రీరామమూర్తి

ఇస్స్.. భరించడం కష్టం ఎంతకాలం. ప్రకృతిని చూస్తే ప్రాణాలు లేచొస్తున్నాయి, ప్రేమ తీగె పెంపొందుంతూంది. అబ్బా అదుగో శశాంకమణి చక్కగా నాకేసే చూస్తూ నీ భావం గ్రహించా అని నవ్వుతోంది. చూడు గోదావరి తరంగాలు... కాదు, నా హృదయ సముద్ర తరంగాలు.  ఎంత అందం. ఎంత మృధుత్వం.. ఎంత సున్నితం.. ఎంత సోయగం.. ఆ మల్లెపువ్వు. కాదు నా హృదయ కమలం; ఎలా వికసిస్తూందో ఆ సువాసన ఎంత మధురంగా విరజిమ్ముతూందో అయ్యో కళ్ళు తేలిపోతున్నాయి. ప్రేమ మైకం.. బంధించా యిప్పటివరకూ నా సున్నిత మనసుని కఠినంగా అంటకుండా చేశా. ఆ కామాన్ని అన్యాయంగా ఎందుకూ సంఘాన్ని లెక్క చేయకుండా పునర్వివాహ ప్రయత్నాలు మానాన్న చేస్తాడని, ఏం లాభం. ఎన్నాళ్ళు చూసినా  ఆయన మనస్సులోకి ఆ తలంపే రావడం లేదు. యిప్పటికి నాలుగేళ్ళయింది పుష్పవతి అయి. ఎందుకూ అనుకుంటే ఆవేదనా తరంగాలొచ్చి... నన్ను తబ్బిబ్బు చేస్తున్నాయి. పుట్టిన పదేళ్ళకే పెళ్ళి.  పెళ్ళి అయిన రెండో సంవత్సరానికీ విధవను. అభాగినిని ఛీ!ఛీ! ఎందుకూ నే పుట్టడం  చావడాన్కా  యీ మధ్య సౌందర్యం... సౌఖ్యం.. అనుభవించడాన్కి అరహత లేదూ_ ? ఎందుకు లేదూ ఉంది. నేనేంతప్పు చేశా.. చిన్నప్పుడే పెళ్ళి చేయమని పోరెట్టేనా ? లేదు. ఆయన నన్ను ముట్టకుండా పోయున్నాడు మళ్ళీ పెళ్ళి చేస్తానంటే వద్దన్నానా ఏదీ లేదు. యిది అన్యాయం... ద్రోహం.. నన్నూ ఒక చెట్టులా పడి ఉండమనా!?  అయితే చెట్టుకూడా పుష్పించడం ఫలించడం అంటూ వుంటుందే!  సరే ఒక పక్షిని... అదుగో ఎదురుగా ఆ మామిడి తోపులో గూడెట్టుకొని ప్రియుని కేసి ఎలా పరికించి చూస్తుందో ప్రేమామణి పక్షి.  పక్షికన్నా యింకేముంది ఒక రాతిబండను. అయ్యో యీ కాళ్ళూ యీ చేతులు యీ అందంగా నన్నెదిరిస్తూన్న నడుజవ్వనం.. యివ్వన్ని వృధా కాదు, కాదు. నేను ఒక మానవజాతికి చెందిన స్త్రీనే నాకూ హృదయం, ప్రేమ, ఆశా  అన్నీ నాలో నిబిడీకృతమై ఉన్నాయి. నాకూ యీ ప్రపంచ ప్రకృతి సౌందర్యాన్ని పొందటాన్కి ఆశ ఉంది. అర్హత కూడా ఉంది.

లేని రోగం... ఉన్నా రోగమే; విరహం. వెర్రాడు మా నాన్న నా వాలకం చూసి డాక్టర్ని పిలచాడు. ఆ డాక్టరు వచ్చి నన్ను పరీక్షిస్తూ నాకేసి ఒక్కసారి చూశాడు. అతని కళ్ళల్లో చక్కని తేజస్సు గోచరమయింది. నేనూ చూశా నా చూపులో ఏం చూశాడో అలాగే చూడ్డం ప్రారంభించాడు. యిద్దరి చూపులూ ఏకాగ్రతగా అలాగే ఒక నిమిషం వరకూ ప్రేమ మిళితంగా చూశాయి. అప్పుడే యిద్దరి పెదాలంటా చక్కని చిరునవ్వు తొణుగుల్లాడుతోంది. అయితేనేం నాలో ఉన్న రోగం ఆ డాక్టరు అన్నా ప్రేమా.. అప్పుడే కాదు, పూర్తిగా గ్రహించాడు. ఏదో

మందిస్తున్నా అనే మిసమీద నన్ను చూడ్డాన్కి రోజూ మాయింటికొస్తూ యుండేవాడు. మా యిద్దరిలో అప్పుడే క్రొత్తమార్పు కనిపించింది. అతన్ని చూడ్డంలోనే నాలో ఉల్లాస తరంగం ఉబికి పైకి వచ్చేది. ఎన్నాళ్ళు యిలా దాపరికం అనుకున్నా! నేనే సాహసించా నా ప్రేమ ఒక ఉత్తరం ద్వారా తెలియపర్చా. అందుకూ ఆయనా ఒప్పుకున్నట్టు తలవూపాడు. ఉత్తరాలు గుప్పాడు; దాంతో నాకు మరింత ఆనందం కల్గింది. అతనికీ పెళ్ళి కాలేదటని తెలిసి.

ఊ అంటే ఊ అనుకున్నాం. అందచందాలకూ తెలివి తేటలకూ యిద్దరిదీ సమాన చేయే అయితేనేం మా యిద్దరకూ ఒక్కటే తేడా కులం దానికేంలే

★ ★ ★

నాకు యిప్పుడు తెలిసింది భార్యా భర్తల్లో వుండే ఆనందం. వారు లేనిదే నాకు ప్రపంచం లేదు. నేను లేనిదే వారికీ శూన్యంలాగే తోస్తాంది. అంత ప్రేమోన్నతి శిఖర భాగానున్నాం.

ఇంతకూ ఈ మార్పుకు కారణం చిన్నతనాన్నే పెళ్ళి చేసుకొని పరలోకాన్కి వెళ్ళిన ఆయన గారిదా ? లేక చిన్నప్పుడే పెళ్ళి చేసిన నా తల్లిదండ్రులదా? నా జవ్వనాన్ని వృధా చేయకుండా మరొకన్ని చేసుకున్న నాదా ? మళ్ళీ పెళ్ళి చేస్తే మా లోకం... పదిమందీ పలకరిస్తారా నేను వప్పుకుంటానా!? అని గర్జించే సంఘభల్లూకానిదా? ఆలోచించండి.

★★★

COMMENTS